# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 02-10-2023 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ గాంధీజీ కలలను సాకారం చేసేందుకు అందరూ కృషి చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- ❖ ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డి అన్నారు.
- ❖ విశాఖపట్నం చుట్టుపక్కల ప్రాంతాలలో పచ్చదనాన్ని పెంపొందించడానికి ఏరియల్ సీడింగ్ దోహదపడుతుందని నగర మేయర్ జి హరివెంకట కుమారి తెలిపారు.
- ❖ విద్యుత్ ప్రమాదాలను అరికట్టేందుకు ప్రత్యేక ప్రణాళికను రూపొందించామని ఏపిఈపిడిసిఎల్ సిఎండి పృథ్వీతేజ్ ఇమ్మడి వెల్లడించారు.
- ❖ దక్షిణ జార్ఖండ్, పరిసర ప్రాంతాలపై ఉన్న అల్పపీడన ప్రాంతం ఉత్తర ఛత్తీస్‌గఢ్ ప్రాంతాలకు విస్తరించిందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జాతిపిత మహాత్మాగాంధీ 154వ జయంతిని పురస్కరించుకుని యావత్ దేశం ఆయన్ని స్మరించుకుంటోంది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు ఢిల్లీలోని రాజ్‌ఘాట్‌కు చేరుకుని గాంధీజీ స్మారకస్థలి వద్ద అంజలి ఘటించారు. భారతీయులతో పాటు పలువురు విదేశీ నేతలు, ప్రతినిధులు మహాత్ముడి సేవలను గుర్తు చేసుకుని సామాజిక మాధ్యమాల్లో ఆయనకు నివాళులర్పించారు. "గాంధీజీ సిద్ధాంతాలు కేవలం ఆలోచనల్లో నుంచి వచ్చినవి కాదని, ఆయన మాటలు, చేతలు, ఆలోచనల్లో ఐకమత్యమే స్ఫురించేదని, అందుకే నేటికీ అవి మనకు ఉపయోగపడుతున్నాయని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ, గాంధీజీ కలలను సాకారం చేసేందుకు అందరూ కృషి చేయాలని అన్నారు. అలాగే ఆయన సిద్ధాంతాలను అనుసరిస్తూ ఇకమత్యాన్ని పెంచుకోవాలని ఉద్ఘాటించారు. వారి బోధనలు ఎప్పుడూ ప్రకాశింప చేస్తూనే ఉంటాయని వ్యాఖ్యానించారు. యువత కలలను సాకారం చేసేందుకు కృషి చేస్తానని ప్రధాని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డి అన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గం రొళ్ల మండలం ఆర్.వడ్రహట్టిలో అభ్యుదయ రైతుల పంట పొలాలను ఈరోజు ఆయన పరిశీలించి వారిని అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, భవిష్యత్తులో మరింత మంది రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని కోరారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సాహకారం అందిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు తిప్పేస్వామి, జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, సబ్ కలెక్టర్ కార్తిక్, జెడ్పిటిసీ అనంతరాజు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని ఏపిఈపిడిసిఎల్ సిఎండి పృథ్వీతేజ్ ఇమ్మడి పిలుపునిచ్చారు. విశాఖలో ఈరోజు విద్యుత్ భద్రత అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న ఆయన విద్యుత్ భద్రత అవగాహన రధాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యుత్ భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఎన్నో కార్యక్రమాలను నిర్వహించామని తెలిపారు. విద్యుత్ ప్రమాదాలను అరికట్టేందుకు ప్రత్యేక ప్రణాళికను రూపొందించామని, ఇందులో భాగంగా సంస్థ పరిధిలోని 11 జిల్లాల్లో ఉన్న శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, ఏలూరు సర్కిళ్లలోని వినియోగదారులు, సిబ్బందికి విడివిడిగా భద్రతా సూచనలను ప్రత్యేకంగా తయారు చేసి వాటిని భద్రతా అవగాహనా రథం ద్వారా ప్రచారాన్ని ప్రారంభించామ ని తెలిపారు. వినియోగదారులు విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబరు 1912కు ఫోన్ చేసి విద్యుత్ సమస్యలు తెలియచేయవచ్చని ఆయన తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

గాంధీ జయంతి సందర్భంగా మహా విశాఖ నగరపాలక సంస్థ, తూర్పు నౌకాదళ కమాండోలు సంయుక్తంగా విత్తన బంతులను నాలుగు హెలికాప్టర్ల ద్వారా కొండలపైకి చాల్లే కార్యక్రమాన్ని ఈ రోజు నిర్వహించారు. విశాఖపట్నంలోని పావురాలకొండ, కాపులుప్పాడ, సింహాచలం, పొర్లుపాలెం కొండ, పెదుళ్లనరవ కొండ, యారాడ సహా పలు ప్రాంతాల్లో ఏరియల్ సీడింగ్ చేపట్టామని రియర్ అడ్మిరల్ మనీష్ శర్మ తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని, 1.5 లక్షల విత్తన బంతులను వేయడం జరిగిందని, విశాఖపట్నం చుట్టుపక్కల ప్రాంతాలలో పచ్చదనాన్ని పెంపొందించడానికి ఇది దోహదపడుతుందని నగర మేయర్ జి హరివెంకట కుమారి పేర్కొంటూ....

(వాయిస్ 35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆసియా క్రీడలు 2023 మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో రజత పతకం సాధించిన జ్యోతి యార్రాజీకి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. జ్యోతి అంకితభావం, కృషి ఆంధ్రప్రదేశ్‌తో పాటు, భారతదేశం గర్వించేలా చేసిందని ముఖ్యమంత్రి ట్వీట్ చేశారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని గాంధీ మందిరంలో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపముఖ్యమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధితోనే గ్రామ స్వరాజ్యం సాధించవచ్చని మహాత్మా గాంధీ తెలిపారని ఆయన పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

దక్షిణ జార్ఖండ్, పరిసర ప్రాంతాలపై ఉన్న అల్పపీడన ప్రాంతం ఉత్తర ఛత్తీస్‌గఢ్ ప్రాంతాలకు విస్తరించిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, యానంలో దిగువ ట్రోపో ఆవరణములో పడమటి గాలులు వీస్తున్నాయని తెలిపింది. అలాగే రానున్న రెండు రోజుల్లో తేలిక పాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు, అనేక చోట్ల కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

అలిపిరి నుండి తిరుమలకు నడచి వచ్చే మార్గంలో 12 ఏళ్ళ లోపు పిల్లల విషయంలో ఆంక్షలు సడలిస్తామని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి తెలిపారు. ఈరోజు తిరుమలలో భక్తుల రద్దీ దృష్ట్యా క్యూలైన్లను ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా మరింత కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. క్యూలైన్లలో ఉండే భక్తులు అవసరమైన తగిన వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

మహాత్మా గాంధీ అనుసరించిన సత్యం, ధర్మం, అహింసా మార్గాలు ఎప్పటికీ ఆదర్శనీయమని విశాఖపట్నం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లిఖార్జున అన్నారు. కలెక్టరేట్ ప్రాంగణంలో ఈ రోజు మాహాత్ముని విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, గాంధీజీ సిద్ధాంతాలను అందరూ ఆచరించాలన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగిన కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి మాట్లాడుతూ, గాంధీ జయంతని అంతర్జాతీయ అహింసా దినోత్సవంగా జరుపుకుంటున్నామని అన్నారు. అలాగే భారతీయ జనతా పార్టీ శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో నగరంలోని గాంధీ పార్కులో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు బి.ఉమామహేశ్వర రావు మాట్లాడుతూ, గాంధీజీ ఆశయాలు, ఆలోచనలు, సిద్ధాంతాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమలు చేస్తున్నారని అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

పి.ఎం.స్వనిది పథకం అమలులో రాష్ట్రంలో శ్రీకాకుళం జిల్లా అగ్రస్థానంలో నిలిచిందని జిల్లా మెప్మా ప్రాజెక్టు పథక సంచాలకులు ఎం.కిరణ్ కుమార్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఆమదాలవలస, పలాస, ఇచ్ఛాపురం మున్సిపాల్టీలు, శ్రీకాకుళం నగర పాలక సంస్థ పరిధిలో 8 వేల 570 మంది చిరు వ్యాపారులకు వివిధ బ్యాంకుల సహకారంతో రుణాలు అందజేసామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైస్సార్ తోడు పథకం కింద 23 వేల మంది వీధి వ్యాపారులకు ఋణాలు అందజేసామని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పి.ఎం.స్వనిది పథకం, జగనన్న తోడు పథకాలతో వడ్డీ వ్యాపారుల అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు అవకాశం కలిగిందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

జగనన్న స్వచ్ఛ సంకల్పంలో పని చేస్తున్న క్లాప్ మిత్రలకు ఆరోగ్య పరీక్ష శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఏలూరు జిల్లా పంచాయితీ అధికారి తూతిక శ్రీనివాస్ చెప్పారు. ఏలూరులో మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డీపీఓ మాట్లాడుతూ, పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య శాఖ సహకారంతో 547 గ్రామ పంచాయతీల నుంచి ఇప్పటి వరకు సుమారు 800 పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు. రాష్ట్రంలో ఏలూరు జిల్లాలో మాత్రమే ఈ ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

పరిశుభ్ర పరిసరాలే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ పక్వాడా కార్యక్రమం నిర్వహిస్తుందని గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ ఎమ్.రామకృష్ణ తెలిపారు. ఈరోజు గుంటూరు రైల్వే స్టేషన్ లో సిబ్బందితో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించిన అనంతరం మాట్లాడుతూ, ప్రతి వ్యక్తి వారంలో రెండు గంటలు స్వఛ్చత కోసం పాటుపడాలని అన్నారు. డివిజన్ లోని 215 ప్రాంతాలలో ప్రతిజ్ఞ చేశామని, ఈ కార్యక్రమంలో భాగంగా అక్టోబరు 31 వరకు స్వఛ్చతా క్యాంపైన్ 3.0 నిర్వహిస్తామని తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = =